క్లుప్తంగా

పరామర్శ



రామలక్ష్మి కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

గుర్ల: మండలంలోని గుజ్జింగివలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు అట్టాడ రామలక్ష్మి గురువారం మృతి చెందారు. ఆమె కుమారుడు అట్టాడ చిన్నంనాయుడు, ఇతర కుటుంబ సభ్యులను జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, అట్టాడ రామకృష్ణ, రెడ్డి అప్పలనర్సయ్య, రెడ్డి మురళి, అట్టాడ అప్పలరాజు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

శృంగవరపుకోట: నియోజకవర్గ కేంద్రం ఎస్.కోటలో కొన్ని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు విద్యుత్‌శాఖ ఏఈ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రధాన రహదారి, రామ్‌నగర్, శ్రీనివాసథియేటర్, ఎస్‌బీహెచ్, ముస్లిం వీధి తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనుల కోసం సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఘనంగా ఆలయ ప్రతిష్టోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలం కోడూరు పంచాయతీలోని రిక్షా కాలనీలో ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్టోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కాలనీ యువత ఆధ్వర్యంలో సుమారు రూ.4లక్షలతో ఆలయాన్ని నిర్మించారు. ప్రతిష్టోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక నాయకులు గేదెల ఆదినారాయణ, గేదెల శంకరరావు, కుప్పిలి చంద్రమౌళి, కుప్పిలి సత్యనారాయణ, యువత పాల్గొన్నారు.

యూనిఫాం, రెయిన్‌కోట్ల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

కొత్తవలస: స్థానిక మేజర్ పంచాయతీ పరిధిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న పారిశుద్ధ్య, ఇతర కార్మికులు 48 మందికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు యూనిఫాం దుస్తులు, రెయిన్ కోట్లు, సేఫ్టీ షూలను మండల కేంద్రంలో గురువారం పంపిణీ చేశారు. పంచాయతీ సాధారణ నిధుల నుంచి ఒక్కొక్కరికీ రెండు జతల యూనిఫాం దుస్తులు, రెయిన్ కోట్లు,సేఫ్టీ షూలను అందజేశారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు పెనగంటి చెల్లయ్య, గొరపల్లి రవి కుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో వివిధ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో సీట్లను భర్తీ చేసేందుకు రెండో విడతలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీలోగా విద్యార్థులు దరఖాస్తులను నేరుగా కళాశాలలో అందజేయవచ్చని తెలిపారు. వివరాలకు కళాశాల కార్యాలయంలో పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతులకు సూడోమోనస్ ప్యాకెట్లను అందజేస్తున్న వ్యవసాయ అధికారులు

లక్కవరపుకోట: వరి పంట సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో ఖాసాపేట గ్రామంలో రైతులకు రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ చంద్రశేఖర్ గురువారం అవగాహన కల్పించారు. వరి పంటలో కలపు నియంత్రణ, ఎరువుల యాజమాన్యం, పురుగు మందుల వినియోగం, తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చన్నారు. అలాగే రైతులు సొంతంగా విత్తనాలు తయారు చేసుకునే విధానాలను వివరించారు..అనంతరం రైతులకు ఉచితంగా సూడోమోనస్ ఫౌడర్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఏఓ స్వాతికుమారి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇది పేదల ప్రభుత్వం

- 'గడప గడపకు మన ప్రభుత్వం' ఎమ్మెల్యే కడుబండి



మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: రాష్ట్రంలో పేదల కోసం పని చేసే ప్రభుత్వం నడుస్తోందని, పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రం ఎస్.కోటలోని సచివాలయం-4 పరిధిలో గురువారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వల్ల ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామసచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ గ్రామాల్లోనే అందిస్తున్నారని చెప్పారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతినెలా ఒకటో తేదీ ఉదయాన్నే తలుపుతట్టి అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్‌లు అందిస్తున్నామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఊళ్లలోనే రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేస్తున్నామని, చెప్పారు. ప్రతీ రెండు వేల జనాభాకు ఒక వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేసి, వాటి ద్వారా వైద్య సేవలను ప్రజలకు చేరువ చేశామని తెలిపారు. గర్భిణుల ఆరోగ్యం నుంచి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం, చదువు, ఉద్యోగం, ఉపాధి, అభివృద్ధి, వృద్ధుల సంక్షేమం వరకూ అన్ని వర్గాల ప్రజలకు ఎవరికి ఏం కావాలో తెలుసుకుని వారంతా లబ్ధి పొందేలా పథకాలను దళారీ వ్యవస్థ లేకుండా పక్కాగా అమలు చేస్తున్న నాయకుడు సీఎం జగన్ అని అన్నారు. ఈ సంక్షేమం కొనసాగాలంటే మరో దఫా జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలని, ఆయన్ని అంతా ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, రాష్ట్ర ఫోక్‌అకాడమీ డైరెక్టర్ వాకాడ రాంబాబు, వేపాడ ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, పుణ్యగిరి ఆలయ ట్రస్టు చైర్మన్ పి.రామకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి, ఎంపీటీసీలు పి.ధర్మారావు, కె.అప్పయ్య, వార్డు సభ్యులు కె.భారతి, గనివాడ శ్రీను, నాగిరెడ్డి రాము, మామిడి శంకర్, కె.జయశంకర్, మోపాడ కోటి, ఈశ్వరఅప్పలనాయుడు, చిప్పాడ రమణ, వై.అప్పారావు, ఒబ్బిన బంగారునాయుడు, మమ్ములూరి సోంబాబు, ఈశ్వరరావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

5న జెడ్పీ చైర్మన్ పుట్టినరోజు వేడుకలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను ఈనెల 5వ తేదీన ఘనంగా నిర్వహించనున్నామని ఆ పార్టీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణ లో మెగా ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశామని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలోని రాగోలుకు చెందిన జెమ్స్ ఆస్పత్రి వైద్యులు హాజరై వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. అలాగే బాపూజీ వృద్ధాశ్రమంలో వృద్ధులు, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈనెల 2వ తేదీన దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దనరావు, పతివాడ రాజారావు, చందక గురునాయుడు, రఘుమండ త్రినాథ్, కోరుకొండ దాలయ్య, ఇప్పిలి తిరుమల తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



బాధితురాలు భర్తకు చెక్కు అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: సంతకవిటి మండలంలోని జావాం గ్రామానికి చెందిన కె.వెంకటేశ్వరరావుకు రూ.3.52 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చీపురుపల్లిలోని తన కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయ నిధి పథకం శ్రీరామ రక్షలా నిలుస్తోందని అన్నారు. జావాం గ్రామానికి చెందిన కె.విమలకు అనారోగ్యం కారణంగా వైద్య సహాయం కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయగా, రూ.3.52 లక్షలు మంజూరు చేశారని చెప్పారు.

పాఠశాలను సందర్శించిన కేంద్ర బృందం



విద్యార్థుల ఆరోగ్యంపై స్థానిక వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర వైద్య బృందం

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలను కేంద్ర కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ వైద్య బృందం గురువారం సందర్శించింది. విద్యార్థుల ఆరోగ్యంపై డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ టి.రమణల బృందం స్థానిక వైద్యసిబ్బందిని ఆరా తీసింది. విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనాలు, ఇతర అంశాలను, బాలికలతో మాట్లాడి శానిటరీ నాప్‌కిన్ల సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాలు బాగుంటున్నాయని, శానిటరీ నాప్‌కిన్ల సరఫరా సక్రమంగా జరుగుతోందని విద్యార్థులు చెప్పడంతో కేంద్ర వైద్యబృందం సంతృప్తి వ్యక్తం చేసింది. వారి వెంట హెచ్‌ఎం గొర్లె పద్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

పర్యావరణ హితం.. మొక్కలు నాటుదాం



హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న ప్రజాప్రతినిధులు, ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు

లక్కవరపుకోట: రోజురోజుకూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని నివారించేందుకు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటాలని ఎల్‌అండ్‌టీ కంపెనీ ప్రతినిధులు ఎ.రమేష్‌నాయుడు, ఎం.నాగేశ్వరరావు కోరారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీ(సీఎస్సార్)లో భాగంగా మండ లంలోని కళ్లేపల్లి-రేగ హైస్కూల్‌లో, కళ్లేపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో 3 వేల మొక్కలను గురువారం నాటారు. హెచ్‌ఎం జి.కృష్ణమూర్తి, రేగ, కళ్లేపల్లి గ్రామాల సర్పంచ్‌లు రావాడ నీలకంఠం, గోకేడ ముసలినాయుడు, రేగ ఎంపీటీసీ బొడ్డు గణపతి, హైస్కూల్ పేరెంట్స్ కమిటీ చైర్మన్ నక్క కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచారం



జాకేరులో మహిళలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకుడు జగన్

వేపాడ: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ మండలంలోని సొంపురం, పాటూరు, జాకేరు గ్రామాల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేదని అన్నారు.పెట్రోల్,డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, సామాన్య ప్రజలకు అందుబాటులో లేవన్నారు. బీజేపీ ప్రభుత్వమే గ్యాస్ ధరలు అమాంతం పెంచేసి, ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో కాస్త ధరలు తగ్గించి, వేరే వాళ్లు పెంచిన ధరలను తాము తగ్గిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వంలోని పెద్దలు ప్రకటన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. లాభనష్టాలతో సంబంధం లేకుండా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారన్నారు. బీజేపీతో రాజ్యాంగానికి, లౌకిక వాదానికి ప్రమాదముందన్నారు. అనంతరం ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



గంట్యాడ: సోదరుడికి రాఖీ కడుతున్న ఎంపీపీ హైమావతి



గుర్ల: వైఎస్సార్‌సీపీ నాయకుడు సన్యాసినాయుడుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



బొండపల్లి: ముద్దూరులో తమ్ముడుకి రాఖీ కడుతున్న అక్క



దత్తిరాజేరు: కోమటిపల్లిలో అన్నయ్యకు రాఖీ కడుతున్న చెల్లెలు

గంట్యాడ/బొండపల్లి/దత్తిరాజేరు/గుర్ల: అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని గంట్యాడ ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా గంట్యాడ మండలంలోని రామవరంలోని ఆమె స్వగ్రామంలో తన అన్నయ్యకు గురువారం రాఖీ కట్టారు. గంట్యాడ, బొండపల్లి, దత్తిరాజేరు, గుర్ల మండలాల్లోని అన్ని గ్రామాల్లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు. దూర ప్రాంతాల్లో ఉండే అక్కచెల్లెమ్మలు గ్రామాలకు వచ్చి తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టారు. స్వీట్లు తినిపించుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గుర్లలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడుకు బ్రహ్మ కుమారీలు ఎంపీడీఓ కార్యాలయంలో రాఖీ కట్టి ఆశీర్వదించారు.

8న ప్రజావేదిక

బొండపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈనెల 8వ తేదీన ప్రజావేదిక నిర్వహించను న్నట్లు ఉపాధి హామీ ఏపీఓ బి.కృష్ణవేణి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022-2023 ఆర్థిక సంవ త్సరానికి సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనులపై డీఆర్పీలు సోషల్ ఆడిట్ పూర్తి చేశారని పేర్కొన్నారు. ఈ ఆడిట్ నివేదికపై అన్నిశాఖల అధికారులతో ప్రజావేదిక నిర్వహించ నున్నామని, మండల ప్రజాప్రతినిధులు, ఉపాధి వేతనదారులు హాజరు కావాలని కోరారు.

సేవలే గుర్తింపునిస్తాయి



ఉపాధ్యాయిని రాజరాజేశ్వరిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

లక్కవరపుకోట: ఏ ఉద్యోగికైనా సేవలే గుర్తింపు నిస్తాయని గంగుబూడి ఉన్నత పాఠ శాల ఇన్‌చార్జి హెచ్‌ఎం జామి అప్పలనాయుడు అన్నారు. ఆపాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన గుమ్మా రాజరాజేశ్వరిని గురు వారం ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను తోటి ఉపాధ్యాయులు కొనియా డారు.

డీఎస్సీ ప్రకటించాలి

గజపతినగరం: రాష్ట్రంలో తక్షణమే డీఎస్సీ ప్రకటించి, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని సేవ్ ప్రైవేట్ టీచర్స్ టీమ్ రాష్ట్ర నిర్వాహ కుడు కన కల చంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ కోసం బీఈడీ, డీఎడ్ పూర్తిచేసిన వేలమంది ఎదురు చూస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టుల వివరాలను ప్రకటించి, నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు.

బలభద్రరాజపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆనంద్‌కుమార్

దత్తిరాజేరు: మండలంలోని బలభద్రరాజపురం గ్రామంలో దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్ట ర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా శిబిరం ఏర్పాటు చేసి ఓపీ (అవుట్ పేషెంట్) సేవలందించారు. 51 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై ఆరా తీశారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచంపై ఉన్న రోగులకు వైద్యతనిఖీలు చేశారు. అలాగే పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు.

బీవీ చానెల్‌లో పూడికతీత



పూడికలు, తుప్పలు తొలగించిన తర్వాత బీవీ చానెల్

బొండపల్లి: బొండపల్లి-వెంకటాపురం(బీవీ) సాగునీటి కాలువలో పూడిక, పిచ్చిమొక్కల తొలగింపు పనులు నాలుగు రోజులుగా కొనసాగుతున్నాయి. గజపతినగరంలోని పట్రువాడ గ్రామం వద్ద చంపావతి నది నుంచి ఈ కాలువ ద్వారా గజపతినగరం, బొండపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందిస్తున్నారు. ఏటా మాదిరి గానే బొండపల్లి ఏపీసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ బి.వి.ప్రభూజీరాజు చొరవ తీసుకుని కాలువలో పూడిక, తుప్పలను ప్రొక్లెయినర్‌తో తీయించారు. దీంతో రెండు మండలాల పరిధిలోని పది గ్రామాల పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందనుంది.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయండి



గుర్లలో ఈ- క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జేడీ రామారావు

గుర్ల: మండలంలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలని వీఏఏలకు జేడీ వి.టి.రామారావు ఆదేశించారు.గుర్లలో పంటలను ఈ -క్రాప్‌లో నమోదు చేసే ప్రక్రియను గురువాం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 12 వేల ఎకరాల్లో వరి పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా కేవలం 2వేల ఎకరాలనే నమోదు చేయడంతో వ్యవసాయ అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 16వ తేదీ నాటికి శతశాతం ఈ-క్రాప్ నమోదు చేయించాలని ఏడీఏ కోటేశ్వరరావు, ఏఓ తిరుపతిరావుకు ఆదేశించారు. రైతులు కూడా అలసత్వం చేయకుండా రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న సిబ్బందిని సంప్రదించి ఈ-క్రాప్ చేయించుకోవాలని సూచించారు.

ఓటర్ల సర్వేపై ఆరా

- గరివిడి, చీపురుపల్లి మండలాల్లో కలెక్టర్ పర్యటన



రామలింగాపురం సచివాలయంలో ఓటర్ల సర్వేపై బీఎల్‌ఓను ఆరా తీస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

చీపురుపల్లిరూరల్: గరివిడి మండలంలోని మందిరవలస, కాపుశంభాం సచివాలయం పరిధి కొండశంబాం, చీపురుపల్లి మండలంలోని రామ లింగాపురం గ్రామాల్లో కలెక్టర్ నాగలక్ష్మి గురువారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఇటీవల బీఎల్‌ఓలు ఇంటింటికీ వచ్చి ఓటర్ల సర్వే సక్రమంగా చేపట్టారా లేదా అని ప్రజలను ఆరా తీశారు. సర్వేలో భాగంగా ఓటర్ల చేర్పులు, తొల గింపుల కోసం వచ్చిన దరఖాస్తులను ఆమె పరిశీలించారు. మరణించిన వారి ఓట్లు తొలగించేందుకు మరణ ధ్రువీకరణపత్రాన్ని వారి కుటుంబ సభ్యుల నుంచి తీసు కోవాలని, లేకుంటే పంచనామా నిర్వహిం చిన తర్వాతనే ఓటు తొలగిం చాలని బీఎల్‌ఓలను కలెక్టర్ ఆదేశించారు. గరివిడి మండలంలోని మందిరవలస గ్రామంలో సచివాల యం,రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలను పరిశీ లించారు. ఈనిర్మాణాలను సెప్టెంబర్-15లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సచివాలయాల సిబ్బందితో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ-క్రాప్ నమోదు, పీఎం కిసాన్ రిజిస్ట్రేషన్, మిషన్ జీఈఆర్ సర్వేపై సిబ్బందిని ఆరా తీశారు. బడి బయట ఉన్న 18 ఏళ్ల లోపు పిల్లల వివరాలను సేకరించి, వారిని పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని, స్కూళ్లలో చేరని పిల్లల వివరాల నివేదికను తమకు అందించాలని అధికారులకు సూచించారు.కొండశంభాంలో భూరీసర్వేలో భాగంగా ఏర్పాటు చేస్తున్న సర్వే రాళ్లను, రామలింగాపురంలో ప్రభుత్వ భవనాలను కలెక్టర్ పరిశీలించారు. ఆర్డీఓ ఎం.అప్పారావు, చీపురుపల్లి, గరివిడి ఎంపీడీఓలు కె.రామకృష్ణరాజు, జి.భాస్కరరావు, తహసీల్దార్‌లు ఎం.సురేష్, టి.గోవింద్, మండల అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

11 గ్రామాల్లో పూర్తయిన భూరీసర్వే

బొండపల్లి: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని 11 గ్రామాల్లో సమగ్ర భూరీసర్వే పూర్తయిందని తహసీల్దార్ డి.జి.ఎం.ఎస్ .ప్రసాదరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ 11 గ్రామాల్లో ప్రభుత్వ, రైతుల సాగుభూములన్నింటినీ సర్వే చేశామని పేర్కొన్నారు. అలాగే నాలుగు గ్రామాల్లో సర్వే హద్దు రాళ్లు ఏర్పాటు పక్రియ కూడా పూర్తయిందని, మిగతా గ్రామాల్లోనూ త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు.



